https://teluguislam.net


# ప్రముఖ వ్యక్తులు, వివిధ తెగల్లో ఇస్లామ్ ధర్మ ప్రచారం

దైవదౌత్య శకం 10, జీఖాదా మాసం (క్రీ.శ.619 జూన్ చివరి భాగం లేదా జులై నెల ప్రారంభ కాలం)లో మహాప్రవక్త (స) తాయెఫ్‌కు వెళ్ళడం, అక్కడి పేరుమోసిన వారికి, తెగలకు ఇస్లామ్ సందేశాన్ని ఇవ్వడం ప్రారంభించారు. హజ్ కాలం దగ్గరపడడం వలన హజ్ చేయడానికి సుదూర ప్రాంతాల నుండి, చుట్టుపట్ల నుండి ప్రజలు వాహనాలపై, కాలనడకన మక్కాకు రావడం ప్రారంభమయింది. మహాప్రవక్త (స) ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి తెగలోనికి వెళ్ళి వారికి ఇస్లామ్ ధర్మం గురించి బోధ చేయడం ఆరంభించారు. దైవదౌత్యపు నాల్గవ సంవత్సరం నుండే, హజ్ కాలంలో బయటకు వెళ్ళి హజ్ యాత్రికులకు ఇస్లామ్‌ను గురించి పరిచయం చేయడం ఆయనకు పరిపాటే.

## ఇస్లామ్ ధర్మం బోధించబడిన తెగలు

ఇమామె జహ్రీ (ర) కథనం ప్రకారం, ఏయే తెగల్లోనయితే ఆయన (స) వెళ్ళి ఇస్లామ్ ధర్మ ప్రచారం చేశారో, ఆ తెగల పేర్లు ఈ విధంగా ఉన్నాయి.

బనూ ఆమిర్ బిన్ సఅసఅ, ముహారిబ్ బిన్ హస్ఫా, ఫజారా, గస్సాన్, ముర్రా, హనీఫా, సలీమ్, అబస్, బనూ నస్ర్, బనుల్‌బకా, కల్బ్, హారిస్ బిన్ కఅబ్, అజ్రా, హజారిమా తెగలు. అయితే వాటిలో ఏ ఒక్క తెగ కూడా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు.[1]

ఇమామె జహ్రీ లెక్కించిన ఈ తెగల్లో ఒకే సంవత్సరంగాని, ఒకే కాలంలో గాని ఇస్లామ్ ధర్మ పరిచయం జరగలేదనేది గుర్తించాలి. దైవదౌత్యపు నాల్గవ సంవత్సరం మొదలు, హిజ్రత్‌కంటే ముందు చివరి హజ్ వరకు గడిచిన పదేండ్ల కాలంలో జరిగిందీ ప్రయత్నం.[2]

1. తిర్మిజీ; ముక్తరుస్సీరత్ - షేఖ్ అబ్దుల్లా, పుట.149.
2. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/74.

https://teluguislam.net



ఇబ్నె ఇస్‌హాక్, కొన్ని తెగల్లో ఇస్లామ్ సందేశ ప్రచారానికి జరిగిన ప్రతి క్రియ ఎలాగుందో కూడా వివరించారు. కొన్ని తెగల ప్రతిక్రియ ఎలాగుండిందో ఇక్కడ సంగ్రహంగా వివరించే ప్రయత్నం చేస్తున్నాము.

**1. బనూ కల్బ్:** మహాప్రవక్త (స) ఈ తెగకు చెందిన ఓ శాఖ అయిన బనూ అబ్దుల్లా వద్దకు వెళ్ళి వారిని అల్లాహ్ మార్గం వైపునకు పిలుపునిచ్చారు. మాటల సందర్భంలో, "ఓ బనూ అబ్దుల్లాహ్! అల్లాహ్ మీ ముత్తాత పేరు ఎంతో మేలైనదిగా పెట్టాడు" అని అన్నారు. కాని ఆ తెగ వారు ఆయన మాటలను లెక్క చేయలేదు. ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించలేదు.

**2. బనూ హనీఫా:** వారి గుడారాల వద్దకు వెళ్ళి, అల్లాహ్ ధర్మం వైపునకు పిలవడం జరిగింది. తాను దైవప్రవక్తనని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు దైవప్రవక్త (స). అయితే అరబ్బులు ఇదివరకు ఇవ్వనంత దురుసు సమాధానం ఇచ్చారు ఆ తెగవారు.

**3. ఆమిర్ బిన్ సఅసఅ:** వారిని కూడా మహాప్రవక్త (స) అల్లాహ్ ధర్మమైన ఇస్లామ్ వైపునకు పిలుపునిచ్చారు. తాను దైవప్రవక్తనని చెప్పారు. దానికి సమాధానంగా బుహీరా బిన్ ఫరాస్ అనేవాడు, "దైవసాక్షి! నేను ఖురైష్‌కు చెందిన ఈ యువకుణ్ణి అందుకుంటే పూర్తి అరేబియానే మ్రింగేయగలను" అని చెబుతూ, "చెప్పండి! ఒకవేళ మేము మీ ఈ ధర్మాన్ని స్వీకరిస్తే, ఆపై అల్లాహ్ మీకు మీ వ్యతిరేకులపై ఆధిపత్యం ఇస్తే, మీ తరువాత అధికారం మా చేతికి వస్తుందా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు.

"అధికారం మొత్తం అల్లాహ్‌దే. ఆయన ఎవరిని ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచుతాడు."

"ఓహో అలాగా! మీ సంరక్షణలో మా వక్షస్థలం అరబ్బు జాతికి ఎదురుగా పెట్టాలా? అల్లాహ్ మీకు విజయం చేకూరిస్తే అధికారం మరొకరి చేతిలో ఉంటుందా? మాకు మీ ధర్మం అవసరం ఎంత మాత్రం లేదు పొండి" అని తిరస్కార వైఖరిని అవలంబించాడు.

ఆ తరువాత అబూ ఆమిర్ తెగ తన ప్రాంతానికి తిరిగి వెళ్ళిపోయిన తరువాత, వృద్ధాప్యం కారణంగా హజ్‌కు వెళ్ళలేక, అక్కడే ఉండిపోయిన ఓ

https://teluguislam.net



వృద్ధుణ్ణి కలసి విషయమంతా చెబుతూ, మా వద్దకు ఖురైష్ వంశానికి చెందిన బనూ అబ్దుల్ ముత్తలిబ్ యువకుడొకడు వచ్చాడని, అతను తనను తాను ప్రవక్తగా ప్రకటించి తనను సంరక్షించమని అడిగాడని, అతనికి సహాయపడ మని, వెంట తీసుకొని మన ప్రాంతానికి తోడ్కొని పొమ్మని చెప్పాడని వివరించారు. ఇది విన్న ఆ వృద్ధుడు తన తలను రెండు చేతులతో పట్టుకొని బాధ పడుతూ -

"అయ్యో బనీ ఆమిర్! దీనికి పరిహారం మరేది? జరిగిపోయినదానికి దిద్దుబాటు ఎక్కడిది? ఆ దైవం సాక్షి! ఎవరి చేతిలోనయితే ఫలానా వ్యక్తి ప్రాణాలున్నాయో! ఏ ఇస్మాయీల్ సంతతి వాడూ ఇప్పటి వరకు బూటకపు ప్రవక్త అని సవాలు విసరలేదు. ఆయన తప్పక ప్రవక్తే! మీ బుద్ధీవివేచనలు ఎక్కడ అడుగంటిపోయాయి?" [3] అని తల బాదుకున్నాడు.

## మక్కాకు వెలుపల విస్తరించిన విశ్వాస కిరణాలు

తెగలకు, వర్గాలకు ఇస్లామ్ గురించి ప్రబోధించినట్లే మహాప్రవక్త (స) వేరు వేరు ప్రముఖ వ్యక్తుల్ని కలసి ఇస్లామ్ సందేశాన్నిచ్చారు. వారిలో కొందరు సకారాత్మకంగా స్పందించారు. హజ్ కాలం గడిచిన తరువాత కొందరు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు కూడా. క్రింద, వారి వివరాలు సంగ్రహంగా వివరించడం జరుగుతోంది.

**1. సువైద్ బిన్ సామత్ :** ఈయన ఓ కవి. లోతుగా ఆలోచించే మనస్తత్వం గలవారు. యస్రిబ్ (మదీనా) నివాసి. ఆయన దృఢసంకల్పం, కవన వ్యాసంగం మరియు గౌరవోన్నతుల రీత్యా ఆయన జాతి ఆయనకు కామిల్ (సంపూర్ణుడు) అనే బిరుదు కూడా ఇచ్చింది. ఈయన హజ్ లేదా ఉమ్రా చేయడానికి మక్కా వచ్చినప్పుడు మహాప్రవక్త (స) ఆయన్ను కలసి ఇస్లామ్ ధర్మం వైపునకు రమ్మని ఆహ్వానించారు. ఆయనతో మాట్లాడేటప్పుడు దైవప్రవక్త (స), 'నీ దగ్గర ఉన్నదేమిటీ?' అని అడగగా సువైద్,

"నా దగ్గర లుక్మాన్ జ్ఞానముంది" అని బదులిచ్చారు.

"అయితే విను, నా దగ్గర ఉన్నది దాని కంటే మేలైన జ్ఞానం. అది ఖుర్ఆన్. దాన్ని అల్లాహ్ నాపై అవతరింపజేశాడు. అది మార్గదర్శకమైన

3. ఇబ్నె హష్షామ్-1/424,425.

https://teluguislam.net



జ్యోతి" అంటూ మహాప్రవక్త (స) దివ్యఖుర్‌ఆన్ ఆయత్‌లను పారాయణం చేసి వినిపించారు. ఇస్లామ్ వైపునకు ఆహ్వానించారు. వెంటనే ఆయన ఇస్లామ్‌ను స్వీకరిస్తూ, "ఇది ఎంతో మేలైనది" అన్నారు. ఆ తరువాత ఆయన మదీనా తిరిగి వచ్చినప్పుడు బుఆస్ యుద్ధం ప్రారంభమైంది. ఆ యుద్ధంలోనే ఆయన చంపి వేయబడ్డారు.[4] ఆయన దైవదౌత్యశకం 11 ప్రారంభదశలో ఇస్లామ్ స్వీకరిం చినట్లు ఆధారాలున్నాయి.[5]

**2. అయాజ్ బిన్ ముఆజ్ :** ఈయన కూడా యస్రిబ్ (మదీనా) నివాసియే. నవయువకుడూను. దైవదౌత్య శకం పదకొండవ సంవత్సరంలో, 'బుఆస్'యుద్ధానికి కొన్ని రోజులకు ముందు, ఓ అవస్ ప్రతినిధి వర్గం, ఖజ్రజ్ తెగకు విరుద్ధంగా ఖురైష్ సహాయాన్ని అర్థించడానికి మక్కా వచ్చింది. ఆ ప్రతినిధి వర్గం వెంట వచ్చారాయన. అవస్ మరియు ఖజ్రజ్ అనే రెండు తెగల నడుమ విద్వేషం పతాకస్థాయికి చేరిన రోజులవి. అవస్ ప్రజల సంఖ్య ఖజ్రజ్ ప్రజల సంఖ్య కంటే తక్కువ. దైవప్రవక్త (స)కు ఈ ప్రతినిధి వర్గం వచ్చిన విషయం తెలియగానే ఆయన (స) వారి దగ్గరకు వెళ్ళారు. వారి నడుమ కూర్చుని ఇలా సంబోధించారు.

"మీరు ఏ ధ్యేయాన్ని దృష్టిలో ఉంచుకొని ఇక్కడికి వచ్చారో ఆ ధ్యేయం కంటే మేలైన విషయాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా?" అన్నారు.

"అంతకు మించి మేలైన విషయం మరేముంటుంది?" అని ప్రశ్నిం చారు వారు.

"నేను అల్లాహ్ ప్రవక్తను. అల్లాహ్ నన్ను తన దాసుల వద్దకు, వారు అల్లాహ్‌నే ఆరాధించాలనీ, ఆయనకు సహవర్తులుగా మరెవ్వరినీ నిలబెట్ట వద్దనీ పిలుపునివ్వడానికి పంపించాడు. ఆయన నాపై గ్రంథాన్ని కూడా అవత రింపజేశాడు" అంటూ ఇస్లామ్ ధర్మం గురించి విడమర్చి చెబుతూ, దివ్య ఖుర్‌ఆన్‌ను కూడా పఠించి వినిపించారు. అది విన్న అయాస్ బిన్ ముఆజ్,

"ఓ నా జాతి ప్రజలారా! దైవసాక్షి! మీరు ఇక్కడికి దేనికోసమయితే వచ్చారో, దానికంటే ఇది మేలైన విషయం" అని అన్నారు. కాని ఆ ప్రతినిధి

---

4. ఇబ్నె హష్షామ్-1/425-427; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/74.
5. తారీఖె ఇస్లామ్-అక్బర్ షానజీబాబాదీ-1/125.

https://teluguislam.net



వర్గంలోని ఓ వ్యక్తి అబుల్ హైసర్ అనస్ బిన్ రాఫే ఓ పిడికెడు కంకరరాళ్ళను ఎత్తి అయాస్ ముఖంపై విసిరి కొడుతూ, "దీన్ని వదిలేయండి! నా వయస్సు సాక్షిగా చెబుతున్నాను! మనం మరో పనిని దృష్టిలో పెట్టుకొని ఇక్కడకు వచ్చినవాళ్ళం" అని అయాస్ మాటను ఖండించాడు. అయాస్ అప్పుడు మాట్లాడకుండా ఊరకుండిపోయారు. మహాప్రవక్త (స) కూడా లేచి నిలబడ్డారు. వచ్చిన ప్రతినిధి వర్గం ఖురైష్‌తో ఒడంబడిక చేసుకోవడంలో, వారి సహాయం పొందడంలో విజయం సాధించలేకపోయింది. వచ్చిన కార్యంలో విఫలమై మదీనాకు తిరిగి వెళ్ళిపోయింది.

మదీనా వెళ్ళిన కొన్ని రోజుల తరువాత అయాస్ పరమపదించారు. మరణించేటప్పుడు ఆయన నోట దైవస్తోత్రం వెలువడినట్లు ప్రజలు చూశారు. అందుకని ఆయన ఇస్లామ్ ధర్మం పైనే తన ప్రాణాలు వదిలారన్నది ప్రజలకు నమ్మకమున్నట్లు ఆధారాలున్నాయి.[6]

**3. అబూజర్ గఫ్ఫారి :** ఈయన యస్రిబ్ దాపులోనే ఉండే ఓ ప్రదేశంలో నివసించే వ్యక్తి. సువైద్ బిన్ సామత్ మరియు అయాస్ బిన్ ముఆజ్‌ల ద్వారా దైవప్రవక్త (స) గారి దైవదౌత్యం గురించిన వార్త యస్రిబ్‌కు చేరగా అది కాస్తా ఆయన చెవిన కూడా పడింది. ఈ వార్తే ఆయన ఇస్లామ్ స్వీకారానికి దోహదపడింది.[7]

ఆయన ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించిన వివరాలు సహీ బుఖారీలో ఉన్నాయి.

అబూజర్ (ర) ఇలా చెప్పారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్(ర) ఉల్లేఖిస్తున్నారు.

నేను గిఫ్ఫార్ తెగకు చెందినవాణ్ణి. మక్కాలో ఓ వ్యక్తి తనను దైవ ప్రవక్తగా ప్రకటించుకున్నాడని నాకు తెలిసింది. నేను నా సోదరునితో, నీవు మక్కాకు వెళ్ళి ఆయనతో మాట్లాడి వచ్చి విషయం ఏమిటో నాతో చెప్పమని చెప్పాను. ఆయన వెళ్ళి ఆయన్ను కలసి మాట్లాడాడు, తిరిగి వచ్చిన తరువాత ఏం వార్త తెచ్చావు అని అడిగాను.

---

6. *ఇబ్నె హష్షామ్-1/427,428.*
7. *ఇది అక్బర్‌షానజీ బాబాదీ తన గ్రంథంలో పొందుపరచిన విషయం. చూడండి, ఆయన రచించిన గ్రంథం, తారీఖె ఇస్లాం-1/128.*

https://teluguislam.net



"దైవసాక్షి! నేనిప్పటి వరకు అలాంటి వ్యక్తిని చూడలేదు. మేలు చేయమని ఆదేశిస్తూ, దుర్మార్గాల నుండి ప్రజల్ని వారిస్తున్నాడు" అని చెప్పాడు. అతను తెచ్చిన వార్త నాకు తృప్తినివ్వలేదు. నేనే స్వయంగా అక్కడికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. చద్దిమూటను కట్టుకొని, చేతికర్ర తీసుకుని బయలుదేరి మక్కా చేరుకున్నాను. నేను దైవప్రవక్త (స)ను గుర్తు పట్టేదెలా? ఇతరుల్ని అడిగి తెలుసుకోవడం కూడా నాకు ఇష్టంలేదు. కాబట్టి నేను జమ్‌జమ్ నీరు త్రాగుతూ మస్జిదె హరాంలో పడి ఉన్నాను. చివరికి నన్ను హజ్రత్ అలి చూసి, ఈ వ్యక్తి కొత్తవానిలా అగుపడుతున్నాడే అని అన్నారు. నేను సమాధానంగా "అవును" అని అన్నాను. అయితే ఇంటికి వెడదాం పద అని ఆయన నన్ను ఆయన ఇంటికి తోడ్కొని వెళ్ళారు. వెడుతూ ఆయన నన్ను ఏదైనా విషయం అడగడంగాని, నేనాయనకు బదులు ఇవ్వడం గాని ఏదీ జరగలేదు.

తెల్లవారగానే ఎవరినైనా అడిగి తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనే మస్జిదె హరామ్‌కు వెళ్ళాను. కాని ప్రవక్త (స) గురించి తెలపడానికి ఏ ఒక్కడూ నాకు దొరకలేదు. చివరికి హజ్రత్ అలి (ర) యే తిరిగి నా దగ్గరకు వచ్చారు.

"నీకు ఇంకా నీ గమ్యం ఏదో లభించలేనట్లుందే" అని అన్నారు.

"అవును" అని అన్నాన్నేను. "అయితే నా వెంటరా, అసలు నీ వ్యవహారం ఏమిటో బోధపడడం లేదు. నీవీ నగరానికి ఎందుకు వచ్చినట్లు?" అని అడిగారు.

"మీరు రహస్యంగా ఉంచుతానంటే చెబుతాను" అన్నాన్నేను.

"సరే! అలాగే" అని హామీనిచ్చారాయన.

"ఇక్కడ ఒకాయన తాను ప్రవక్తనంటూ చెప్పుకుంటున్నాడట. నేను నా సోదరుణ్ణి అతనితో మాట్లాడి రమ్మని పంపించాను. అతను తిరిగి వచ్చి చెప్పిన మాటలు నాకు తృప్తినివ్వలేదు. నేనే స్వయంగా వెళ్ళి ఆయన్ను కలుద్దామనే తలంపుతో ఇక్కడికి వచ్చాను."

"సోదరా! నీవు సరైన చోటికే వచ్చావు. చూడు! నేనాయన వద్దకే వెడుతున్నాను. నేను ఏ ఇంట జొరబడితే నీవు కూడా నా వెంట ఆ ఇంట్లో ప్రవేశించు. నేను అక్కడికి వెళ్ళినప్పుడు నీకు ఏదైనా ప్రమాదం కలిగించే వ్యక్తిని చూడగానే గోడవైపు తిరిగి నా చెప్పుల్ని సరిచేస్తూ నిలబడతాను. నీవు నా వెంటే

https://teluguislam.net



దారిని నడుస్తూ ఉండు" అంటూ హజ్రత్ అలి నడకనారంభించారు. నేనూ ఆయన్ను అనుసరిస్తూ పోతున్నాను. చివరికి ఆయన ఓ గుమ్మంలో ప్రవేశించారు. నేనూ ఆయన వెంట దైవప్రవక్త (స) గారి సన్నిధికి చేరుకున్నాను. నేను ప్రవక్త (స) నుద్దేశించి-

"మీరు నాకు ఇస్లామ్ ధర్మం ఏమిటో బోధిస్తారా?" అని అడిగాను.

ఆయన నాకు ఇస్లామ్ ధర్మం గురించి విడమర్చి చెప్పారు. నేను వెంటనే ఆ ధర్మాన్ని స్వీకరించి ముస్లిమునైపోయాను. ఆ తరువాత మహాప్రవక్త (స) నన్ను ఉద్దేశించి, "అబూజర్! ఈ వ్యవహారాన్ని గోప్యంగానే ఉంచండి. మీ ప్రాంతానికి వెళ్ళిపొండి. మేము బయటకు వచ్చి బాహాటంగా ప్రచారం చేస్తున్నట్లు వార్త అందగానే ఇక్కడికి వచ్చేయండి" అని అన్నారు.

"ఏ దైవమయితే మీకు సత్యమిచ్చి పంపించాడో, ఆ దైవం సాక్షి! నేను వారి మధ్యకు వెళ్ళి బహిరంగంగా ప్రకటిస్తాను అని చెప్పి మస్జిదె హరామ్‌కు వచ్చాను. అక్కడ ఖురైష్ కూర్చునే ఉన్నారు. వారినుద్దేశించి, ఓ ఖురైష్ ప్రజలారా! ఇది వినండి అంటూ,

**"అష్హదుఅల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ."**

(అల్లాహ్ తప్ప వేరే పూజ్యుడులేడని, ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్త మరియు ఆయన దాసుడని నేను సాక్ష్యమిస్తున్నాను) అని ప్రకటించాను.

అక్కడ కూర్చొని ఉన్నవారు, "చూస్తారేం, లేవండి! లేచి, ఆ ధర్మభ్రష్టుడి పని పట్టండి" అని అరిచారు. వారంతా లేచి నాపైబడ్డారు. ప్రాణం పోయేంత వరకు నన్ను బాదనారంభించారు. కాని ఇబ్నె అబ్బాస్ (ర) వచ్చి నన్ను రక్షిస్తూ, వంగి నా ముఖాన్ని చూశారు. ఆ తరువాత ఖురైష్ వైపు తిరిగి, "మీరు నాశనం గాను! మీరు గిఫ్ఫార్ తెగకు చెందిన ఈ వ్యక్తిని చంపేస్తున్నారా? వ్యాపారార్థం ఈ గిఫ్ఫార్ తెగ ఉండే ప్రదేశం నుండే కదా మీరు వెళ్ళేది!" అని అన్నారు. అది విన్న వారందరూ నన్ను వదిలేసి ప్రక్కకు తప్పుకున్నారు. మరుసటి రోజు ఉదయమే నేను తిరిగి అక్కడికి వెళ్ళాను. ఈ రోజు చెప్పినట్లే తిరిగి ఎలుగెత్తి చెప్పాను. తిరిగి వారు ఈ ధర్మభ్రష్టుని పని పట్టండి అని నాపై విరుచుకు

https://teluguislam.net



పడ్డారు. నిన్న జరిగినట్లే ఈ రోజు కూడా జరిగింది. హజ్రత్ అబ్బాస్ (ర) వచ్చి నన్ను రక్షించారు. నాపై వంగి నిన్న చెప్పినట్లుగానే చెప్పారు." [8]

**4. తుఫైల్ బిన్ ఉమర్ దౌసీ :** ఈ బుద్ధిమంతుడు కవి, ఆలోచనాపరుడు. దౌస్ తెగకు సర్దారు. ఈయన తెగకు యమన్ చుట్టుప్రక్కల ఓ ప్రదేశంలో ప్రాబల్యం ఉండేది. దైవదౌత్యపు పదకొండవ సంవత్సరంలో మక్కాకు వచ్చారు. ఇంకా మక్కాను చేరారో లేదో మక్కావాసులు ఆయన్ను ఘనంగా ఆహ్వానించారు. ఎంతో గౌరవమర్యాదలు చూపారు. ఆ తరువాత ఆయనతో, "తుఫైల్! మీరు మా నగరానికి వచ్చారు. మాకు సంబంధించిన ఈ వ్యక్తి ఉన్నాడు చూశారు, మమ్మల్ని ఎంతో ఇరుకున పడేశాడు. మమ్మల్ని ఒక త్రాటిపై నిలువకుండా చెల్లాచెదరు చేస్తున్నాడు. ఇతను మాట్లాడే మాట ఇంద్ర జాలంలా పని చేస్తోంది. తండ్రీ కొడుకుల మధ్య, సోదరుడూ సోదరునీ నడుమ, భార్యాభర్తల నడుమ చిచ్చుపెట్టి వేరుచేస్తోంది. మేము చిక్కుకున్న బాధల్లో మీరూ, మీ జాతి చిక్కుకోకుండా ఉండాలని మేము కోరుకుంటున్నాం. కాబట్టి మీరు ఆ వ్యక్తితో మాట్లాడవద్దు. అతను చెప్పేది ఏదీ వినకూడదు" అని అన్నారు.

హజ్రత్ తుఫైల్ (ర) గారే స్వయంగా ఆ సంఘటన గురించి ఇలా వివరించారు.

"వీరు అలా బలవంతపెడుతుంటే, నేను దైవప్రవక్త (స) చెప్పింది ఏదీ వినేదే లేదు అని నిశ్చయించుకున్నాను. ఆయనతో మాట్లాడకూడదు అని నిర్ణయించుకున్నాను. ఆ సంకల్పంతోనే నేను మస్జిదె హరామ్‌లోనికి ప్రవేశించి నప్పుడు ఆయన పలుకులేవీ నా చెవుల్లో పడకూడదు అనే ఉద్దేశ్యంతోనే చెవుల్లో దూదిపెట్టి దోపుకు వచ్చాను. అయితే అల్లాహ్, ఆయన మాటలను కొన్ని వినాలని రాసి పెట్టాడేమో, ఆయన నోట బహు చక్కటి వాక్కులు విన్నాను. ఆ తరువాత నా మనస్సులో ఇలా తలపోశాను: నా తల్లి నా గురించి రోదించుగాక (నేను నాశనమైపోను అని అర్థం)! నేను ఓ ఆలోచనాపరుడనైన కవిని కదా! చెడ్డది ఏదో నాకు తెలియకుండా ఉంటుందా? మరి నేను ఈ వ్యక్తి మాటలను ఎందుకు వినకూడదు? మంచి మాటలయితే స్వీకరిస్తాను. చెడ్డవి అయితే విసర్జిస్తాను అని అనుకొని ఆగిపోయాను. మహాప్రవక్త (స) ఇంటికి మరలి వెళ్ళిపోయేటప్పుడు నేను ఆయన్ను అనుసరించాను. ఆయన ఇంట

8. *సహీ బుఖారి- జమ్ జమ్ గాథకు సంబంధించిన అధ్యాయం, 1/ 499,500.*

ప్రవేశించగానే నేను లోనికి వెళ్ళిపోయాను. ఆ తరువాత నేను వచ్చిన కారణం, ప్రజలు నన్ను భయపెట్టిన వైనం, ఆ తరువాత చెవుల్లో దూది కుక్కుకున్నది, అయినప్పటికీ కొన్ని మాటలు చెవుల్లోబడిన తీరు వగైరాలు వివరంగా ఆయనకు చెప్పి అసలు విషయం ఏమిటో సెలవియ్యుమని మనవి చేశాను. మహాప్రవక్త (స) నాకు ఇస్లామ్ ధర్మాన్ని బోధించారు. దివ్యఖుర్‌ఆన్‌ను పఠించి వినిపించారు. దైవాన్ని సాక్షిగా పెట్టి చెబుతున్నాను! అంతకంటే మేలైనది, న్యాయవంతమైన వాక్కు నేను అది వరకు ఎప్పుడూ విని ఉండలేదు. కాబట్టి వెంటనే ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి సత్యానికి సాక్ష్యంగా నిలిచాను. ఆ తరువాత, ప్రవక్తా! నా జాతి నా మాట వింటుంది. వారి వద్దకు వెళ్ళి వారిని ఇస్లామ్ వైపునకు ఆహ్వానిస్తాను. కాబట్టి అల్లాహ్ నాకు ఏదో ఒక సూచనను ప్రసాదించమని అల్లాహ్‌ను ప్రార్థించండి అని విన్నవించుకోగా, ఆయన నా గురించి ప్రార్థించడం జరిగింది."

హజ్రత్ తుఫైల్‌కు అల్లాహ్ ఒసగిన సూచన ఏమిటీ అంటే, ఆయన తన జాతి వద్దకు వెళ్ళినప్పుడు అల్లాహ్ ఆయన ముఖంపై జ్యోతిలాంటి ఓ కాంతిని పులమడం. అది చూసిన ఆయన, ఓ అల్లాహ్ ఈ వెలుగును నా ముఖానికి కాకుండా మరెక్కడైనా ఉండేటట్లు చెయ్యి. ప్రజలు నా ముఖాన్ని చూసి దాన్ని చెరిపేయగలరు అని ప్రార్థించగా ఆ వెలుగు ఆయన లాఠీలోనికి వచ్చి చేరింది. ఆ తరువాత ఆయన తన తండ్రి మరియు భార్య వద్దకు వెళ్ళి ఇస్లామ్‌ను బోధించారు. వారిద్దరూ ఇస్లామ్ స్వీకరించడం జరిగింది. కాని ఆయన జాతి మాత్రం ఇస్లాం ధర్మాన్ని స్వీకరించటంలో జాప్యం చేసింది. అయినా హజ్రత్ తుఫైల్ ప్రయత్నిస్తూనే ఉన్నారు. చివరికి 'ఎహ్‌జాబ్ పోరాటం[9] తరువాత ఆయన హిజ్రత్ చేసినప్పుడు ఆయన వెంట డెబ్భై లేదా ఎనభై కుటుంబాలు ఉన్నాయి. హజ్రత్ తుఫైల్ (ర) ఇస్లామ్ కోసం గొప్పగా పాటుబడ్డారు. 'యమామా' పోరాటంలో అమరగతి పొందారు.[10]

**5. జిమాద్ అజ్‌దీ :** ఈయన యమన్‌కు చెందిన వారు. అజ్‌ద్ షన్వా తెగకు చెందిన వ్యక్తి. భూత వైద్యం, దెయ్యాలను పారద్రోలడం ఆయన వృత్తి.

---

*9. హుదైబియా ఒప్పందం తరువాత ఆయన మదీనాకు వచ్చినప్పుడు దైవప్రవక్త(స) ఖైబర్‌లో ఉన్నారు. చూడండి. ఇబ్నె హష్షామ్-1/385.*

*10. ఇబ్నె హష్షామ్-1/182, 185; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/81,82; ముక్తసరుస్సీరత్ షేఖ్ అబ్దుల్లాహ్, పుట. 144.*

https://teluguislam.net



మక్కా నగరానికి వచ్చినప్పుడు అక్కడి బుద్ధిహీనులు, దైవప్రవక్త (స) ఉన్మాది అని ఆయనకు నూరిపోశారు. ఇది విన్న జిమాద్, నేనెందుకు ముహమ్మద్‌ను కలువకూడదు. బహుశా అల్లాహ్ నా చేతిలోనే ఆయనకు స్వస్థత ఉంచాడేమో, భూతవైద్యం చేసి ఆయనపై ఉన్న దెయ్యాల్ని ఎందుకు పారద్రోలకూడదు? అనే తలంపుతో దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చారు. ఆయన్ను (స) కలసి ఓ ముహమ్మద్ (స)! నేను దెయ్యాలను వదలగొట్టడానికి భూత వైద్యం చేసేవాణ్ణి. నీకు కూడా దాని అవసరం ఉందేమో చెప్పు అని అడిగారు. జవాబుగా మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

"యదార్థంగా స్తోత్రాలన్నీ అల్లాహ్‌కే. మేము ఆయన్నే స్తుతిస్తున్నాము. ఆయన సహాయాన్నే అర్థిస్తున్నాం. అల్లాహ్ ఎవరికయితే మార్గం చూపుతాడో అతణ్ణి మరెవ్వరూ మార్గభ్రష్టునిగా చేయలేరు. అల్లాహ్ ఎవరిని దారి తప్పిస్తాడో అతనికి మరెవ్వరూ మార్గం చూపలేరు. అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఆరాధనకు అర్హుడు కాడనీ, అతను ఒక్కడేననీ, ఆయనకు మరెవ్వరూ సహవర్తులు లేరనీ నేను సాక్ష్యం ఇస్తున్నాను. ఇంకా, ముహమ్మద్ (స) ఆయన దాసుడు మరియు ప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను." (ఆ తరువాత)...

ఇది ఆలకిస్తున్న జిమాద్, ఏమిటీ ఈ వాక్కుల్ని మరోసారి వల్లించండి అని అడిగాడు. అలా పై వాక్యాలను మూడుమార్లు విన్న తరువాత జిమాద్, "నేను కాహిన్‌లు, ఇంద్రజాలికులు, కవుల మాటల్ని విని ఉన్నవాణ్ణి. కాని మీరు పలికిన ఈ మాటల్ని నేనెక్కడా వినలేదు. ఇవి సముద్రపు లోతుల్లో నుండి వచ్చిన పలుకుల్లా ఉన్నాయి. ఏదీ మీ చెయ్యి చూపండి. మీ చేతి మీద చేయి వేసి బైత్ (ప్రమాణం) చేస్తాను" అని అనగా మహాప్రవక్త (స) తన చేతిని ముందుకు చాచారు. ఆ చేతిపై చేయివేసి ఆయన ఇస్లామ్ ధర్మస్వీకార ప్రమాణం చేశారు.[11]

## యస్రిబ్‌కు చెందిన ఆరుగురు అదృష్టవంతులు

దైవదౌత్య శకం పదకొండవ సంవత్సరం హజ్ కాలం ( క్రీ.శ.620, జులై మాసం)లో ఇస్లామ్ సందేశ ప్రచారానికి కొందరు చేయూతనిచ్చిన అదృష్ట వంతులు లభించారు. వారి చేయూత వలన ముస్లిములు వారి అండన చేరి, సంవత్సరాల తరబడి అనుభవిస్తున్న బాధల నుండి విముక్తులయ్యారు.

---

*11. సహీ ముస్లిమ్-మిష్కాతుల్ మసాబీహ్, దైవదౌత్య సూచనల అధ్యాయం,2/525.*

https://teluguislam.net



మక్కావాసులు దైవప్రవక్త (స)ను తిరస్కరించడంలో, ప్రజల్ని దైవ మార్గం నుండి అడ్డుకోవడంలో చేస్తున్న కృషి అలా సాగుతూనే ఉంది. మహా ప్రవక్త (స) రాత్రి చీకట్లలో ముష్రిక్‌లు అడ్డుతగలకుండా ఉండేందుకు వివిధ తెగల వద్దకు వెళ్ళి దైవధర్మాన్ని బోధించడమూ జరిగేది.

ఈ యుక్తిని అవలంబిస్తూ మహాప్రవక్త (స) ఓ రాత్రి హజ్రత్ అబూ బక్ర్ (ర)ను, హజ్రత్ అలీ (ర)ను వెంటబెట్టుకొని బయలుదేరారు. బనూ జుహల్ మరియు బనూ షైబాన్ బిన్ సాలిబా విడిది చేసి ఉన్న గుడారాలకు వెళ్ళి వారితో ఇస్లామ్ ధర్మం గురించి చర్చించడం జరిగింది. వారు ఇచ్చిన సమాధానమయితే తృప్తికరమైందే కాని ఇస్లామ్ ధర్మస్వీకారం విషయంలో ఖచ్చితంగా ఏ నిర్ణయమూ గైకొనలేదు. ఈ సందర్భంలో హజ్రత్ అబూ బక్ర్ (ర) మరియు బనూ జుహల్‌కు చెందిన ఓ వ్యక్తి నడుమ వంశావళి గురించి ఉత్సాహభరితమైన చర్చ కూడా జరిగింది. ఆ ఇద్దరు వంశావళి చెప్పడంలో మంచి నిపుణులు.[12]

ఆ తరువాత మహాప్రవక్త (స) మినా కొండ లోయ నుండి వెడుతూ, కొందరు వ్యక్తులు పరస్పరం మాట్లాడుకోగా విన్నారు.[13] నేరుగా వారి వద్దకు వెళ్ళారు దైవప్రవక్త (స). వీరు మొత్తం ఆరుగురు యువకులు. వీరంతా యస్రిబ్‌కు చెందిన తెగ బనూ ఖజ్రజ్‌కు సంబంధించినవారే. వారి పేర్లు ఇవి:

1. అస్అద్ బిన్ జురారాహ్ (బనీ నజ్జార్ కుటుంబం)
2. ఔన్ బిన్ హారిస్ బిన్ రిఫాఅ (ఇబ్నె అఫ్రా) (బనీ నజ్జార్ కుటుంబం)
3. రాఫె బిన్ మాలిక్ బిన్ అజ్లాన్ (బనీ జురైఖ్ కుటుంబం)
4. ఖుత్బా బిన్ ఆమిర్ బిన్ నాబీ (బనీ హిరామ్ బిన్ కఅబ్)
5. ఖుత్బా బిన్ ఆమిర్ బిన్ హదీదా (బనీ సల్మా)
6. హారిస్ బిన్ అబ్దుల్లా బిన్ రిమాబ్ (బనీ ఉబైద్ బిన్ గనమ్)

యస్రిబ్ (మదీనా)వారి అదృష్టం ఏమిటంటే, వారు మదీనాకు చెందిన తమ మిత్రపక్షమైన యూదుల నోట, "ఈ కాలంలోనే ఓ ప్రవక్త ప్రభవించబోతున్నాడని, అతను త్వరలోనే ప్రత్యక్షం కాబోతున్నాడని, మేము ఆయనకు విధేయులమై, ఆయన నాయకత్వంలో మిమ్మల్ని సంహరిస్తాము" అనే విషయాన్ని విని ఉండడం.[14]

---

*12. ముక్తరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లా, పుట.150-152.*
*13. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/84.*
*14. జాదుల్ ముఆద్-2/50; ఇబ్నె హష్షామ్-1/429, 541.*

https://teluguislam.net



మహాప్రవక్త (స) వారి వద్దకు వెళ్ళి, "మీరెవరూ?" అని అడిగారు.

"మేము బనూ ఖజ్రజ్ తెగకు చెందినవారం" అని బదులిచ్చారు వారు.

"అంటే యూదుల మిత్రపక్షమా?" అని ప్రశ్నించారు.

"అవును" అని వారు చెప్పగా, "మనమెందుకు కూర్చొని మాట్లాడుకో కూడదు?" అని అడిగారు దైవప్రవక్త (స).

వారు కూర్చోగా, వారి ముందు మహాప్రవక్త (స) ఇస్లామ్ ధర్మం యదార్థ తను గురించి వివరిస్తూ అల్లాహ్ మార్గం వైపునకు వారిని ఆహ్వానించారు. దివ్యఖుర్ఆన్ పారాయణం చేసి వినిపించారు. వారు పరస్పరం మాట్లాడు కుంటూ -

"చూశారా! ఏ ప్రవక్త గురించి అయితే చెబుతూ యూదులు మనల్ని బెదిరిస్తున్నారో ఈయన ఆ ప్రవక్తే అయి ఉండవచ్చు. కాబట్టి యూదులు మమ్మల్ని మించిపోకుండా చూద్దాం" అంటూ లేచి వెంటనే ఆయన పిలుపును అందుకొని ఇస్లామ్ స్వీకరించారు ఆ ఆరుగురు యువకులు.

వీరు యస్రిబ్‌కు చెందిన బుద్ధివివేచనలుగల యువకులు. ఇటీవలే జరిగిన యుద్ధం వారిని బాగా కృంగదీసి ఉంది. వాతావరణాన్ని ఇంకా చీకటి మయంగానే ఉంచింది. అందుకని వారు, ప్రవక్త (స) గారి పిలుపు ఆ యుద్ధాన్ని రూపుమాపడానికి దోహదపడగలదని తలిచారు. కాబట్టి వారు పరస్పరం ఇలా అనుకోనారంభించారు.

"మనం మన జాతి వద్దకు వెళ్ళి దాన్ని ఈ ధర్మం వైపునకు పిలుద్దాం. మన జాతిలో ఉన్న పరస్పర వైరం లాంటిది మరే జాతిలోనూ కానరాదు. బహుశా అల్లాహ్ ప్రవక్త (స) ద్వారా వారందరినీ సంఘటితం చెయ్యవచ్చు. మనం అక్కడికి వెళ్ళి ఆయన (స) కార్యం వైపునకు వారిని ఆహ్వానిద్దాం. మనం ఈ రోజు స్వీకరించిన ధర్మాన్ని వారి ముందుంచుదాం. అల్లాహ్ తలిస్తే ఈయన (స) మనందరిని ఒకే చోట కూడేటట్లు చేయగలడు. ఆ తరువాత మనకు ఈయన (స) కంటే గౌరవనీయుడైన వ్యక్తి ఇంకొకడు లభించడు."

ఆ తరువాత వీరు తమ వెంట ఇస్లామ్ సందేశాన్ని మదీనాకు తీసుకు వెళ్ళారు. అక్కడ ఇంటింటా మహాప్రవక్త (స)గారి చర్చే చోటుచేసుకుంది.[15]

---

15. ఇబ్నె హష్షామ్-1/428, 430.

https://teluguislam.net



## హజ్రత్ ఆయిషా (ర)తో నికాహ్ (వివాహం)

అదే సంవత్సరం షవ్వాల్ నెల (దైవదౌత్యశకం 11)లో దైవప్రవక్త (స) హజ్రత్ ఆయిషాను వివాహమాడారు. అప్పుడు ఆమె వయస్సు ఆరు సంవత్సరాలు. ఆ తరువాత హిజ్రత్ అయిన మొదటి సంవత్సరం షవ్వాల్ నెలలోనే ఆమె మదీనాలో ప్రవక్త (స) ఇంటికి వచ్చేశారు. అప్పుడు ఆమె వయస్సు తొమ్మిదేండ్లు.[16]

16. తల్ఖీహుల్ ఫహూమ్-పుట.10; సహీ బుఖారి-1/550.